# పెంపుడు జంతువు

"నమస్తే!"

ఫోనులో ఆమె సన్నని గొంతు విన్న శేఖరం ఉలిక్కిపడ్డాడు. ఎవరినిగురించి అయితే రోజూ ఆలోచిస్తూ కలలు కంటున్నాడో, ఆమె ధ్వని వినిపించింది. తెలియనట్లు నటించాడు.

"ఎవరు?"

"గుర్తులేదా?"

'రోజూ గుర్తువుంది' లోలోన అనుకుంటూ నిట్టూర్పు విడిచాడు. "చెప్పండి" తన పేరు కలకల ధ్వనులతో ప్రకటింపచేసింది ఆమె.

"ఒకసారి చూడడానికి రాకూడదూ?"

శేఖరంలో కోపమంతా అదృశ్యమైపోయింది. గుండె వేగం హెచ్చి కాళ్ళు తేలిపోయాయి. శరీరమంతా ఏమిటో గగుర్పాటు—ఆమెను చూస్తున్నట్లు.

"వస్తా" నవ్వాడు శేఖరం.

"తక్షణం" ఆమె ఆజ్ఞ చేసింది.

ఆలోచనల మైకంలో, అనంతమైన ఆవేదనలోని ఆనందంతో, అడుగులు వేసాడు కంగారుగా శేఖరం ఆమె యింటివైపు.

గుమ్మంలో అడుగుపెట్టాడు. ఆమె వీధి గుమ్మంవైపు వెనక్కినుంచుని కుక్కను పిలుస్తోంది.

"దూ...దూ..."

కుక్క ఎగిరి గంతేసి ఆమెదగ్గిరికి వచ్చింది.

ఆమె వెనకనే అప్పుడే వచ్చి నిలుచున్న శేఖరాన్ని చూసి బొంయ్ మంది.

"ఏయ్. ఏమిటి?" అంటూ వెనుదిరిగి చూసింది ఆమె.

"అప్పుడే వచ్చేశారే!", నవ్వుతూ "రండి" అంటూ తన గదిలోకి ఆహ్వానించింది.

కుక్క బొంయ్ ఆగలేదు.

"ఏయ్... నోరుముయ్" కుక్క తలమీద లాలనగా కొట్టింది ఆమె.

కుక్క కూనిరాగంతీస్తూ మూలకు పోయింది.

"కూర్చోండి!"

తన గదిలోఉన్న చిన్నపిల్లల కుర్చీ ఒకటి చూపించింది

"నేనేమైనా బాలకుడినా?"

"అబ్బో! పెరిగిపోయారా, ఈలోపుగా? కూర్చోండి, కుర్చీ మీ బరువు భరించగలదు!"

శేఖరం తాపీగా కూర్చున్నాడు,

ఆనందం, ఉద్వేగంతో తలమ త్తెక్కినట్లయింది. స్నో పౌడరు అద్దుకుని, మల్లెపూలు కొప్పులో తురుముకుని, పెళ్ళి నాటి మధుపర్కం కట్టుకుని మందహాసంతో నడిచే ఆ మధ్య వయస్కురాలైన యువతి వదనం చూసినకొలదీ శేఖరంలో ఏమిటో తన్మయత్వం పెరిగిపోతోంది. ఆమెను జీవితంలో పొందలేకపోయినందుకు అతనితో జరిగే పశ్చాత్తాప బాధల సంఘర్షణ అతన్ని చిత్రహింస చేసింది.

"బాగున్నారా?"

"కనిపించటంలేదూ? కులాసాగానే వున్నా."

ఆమె నవ్వింది. గది బయటికి నడిచి మరుక్షణంలో మిఠాయిలతో కాఫీ పట్టుకుని ప్రత్యక్షమయింది.

"తినండి."

"ఊహు."

"ఏం?"

"ఆకలి లేదు, పప్పిక లేదు, తినాలని లేదు ఏమీ వద్దు."

"ఈవేళనా ... ప్రతిరోజూ యిలాగేవుందా?"

"ప్రితిరోజూ!"

"ఎంతకాలంనుంచి?"

"నే పుట్టినప్పటినుంచి—సరా!" నవ్వాడు శేఖరం.

"పోనీ ఏమీ తినకండి!" ఆమె చిన్నబుచ్చుకుంది.

పెంపుడుకుక్క లోపలికి తోకాడించుకుంటూ వచ్చింది.

మిఠాయి ఒకటి చిదిపి కుక్కకు విసిరింది ఆమె.

"మీరు తినకపోతే అంతే..."

శేఖరం ఆ ఫలహారం తిందామనుకున్నాడు లోలోపల. కానీ పైకి ఆ భావం రానీలేదు. ఆమె అదే మిఠాయి కుక్కకు చిదిపిపారేయడం అతనికి చాలా బాధ కల్గించింది. కుక్క. తోక ఆడిస్తూ ఆమె మంచంమీదకు ఎక్కింది. ఆమె కుక్కను దగ్గరకు తీసుకుని దువ్వింది.

"నువ్వైనాచెప్పవే లిల్లీ! ఆయన్ను తినమని" కుక్క బొంయ్‌మని మొర్రిగింది శేఖరంవైపు.

"నా మాట కాకపోతే కుక్కమాటైనా వినండి. అది తినమంటూంది" నవ్వింది ఆమె.

శేఖరానికి ఆ పరాభవాలు భరింపరానివైనాయి. తన్ను కుక్కతో సరిపోల్చేటట్లు, కుక్కకంటె కనిష్ఠంగా

చూచేటట్లు చేస్తున్న ఆమె ప్రసంగం అతనికి శరీరంలో మంటలు రేపింది. ఆమెపై తాను అల్లుకున్న ప్రేమపాశము తెగద్రెంచుకుంటే, తాను బహుశా ఆమెను ఎంత నిర్దయగా చూడగల్గేదీ ఆలోచించుకున్నాడు శేఖరం.

ఇంటికి పిల్చి, ఆవిధంగా ఆమె అవమానం పాలు చేస్తే శేఖరానికి దుఃఖం ఆగలేదు. జీవితంతో ఏ స్త్రీనీ ప్రేమించకూడదనే భావం అతనిలో ఆ క్షణంలో గాఢంగా నాటుకుంది. ఉబికివచ్చే దుఃఖం ఆపుకోలేక కన్నీళ్లు తుడుచుకున్నాడు శేఖరం.

ఆమె శేఖరాన్ని గమనించి తుళ్ళిపడింది.

"ఏమిటి! ఏడుస్తున్నారా ... క్షమించండి ... నేను మరోభావంతో ఏమీ అనలేదు... తినండి ... తినరూ ... చేతిలో పెట్టనా"? మిఠాయి చిదిమి శేఖరం చేతితో రాల్చింది ఆమె.

అంత దుఃఖం ఆమె లాలనతో హరించిపోయింది శేఖరానికి. అతని దుఃఖావేశ వదనం వికసించి నవ్వుతో కాంతివంతమయింది.

శేఖరం మిఠాయి తిని కాఫీ త్రాగాడు.

గతించిన దినాలు. ఆ దినాలలోని స్మృతులు ఒక్కసారి యిద్దరికీ మనస్సుల్లో మెదిలాయి.

"ఇన్నాళ్ళనుంచి ఈ వూళ్ళోవున్నా చూడ్డానికే రాలేదు."

"రమ్మనకపోతే చూడ్డానికి ఎలా వచ్చేది ... భార్యలైన స్త్రీలకు గృహాలంపటాలు ఎన్నో వుంటాయి. తీరికలేని సమయాల్లో వస్తే మీకు అసహ్యం కలగవచ్చు ... అసలే నేనంటే ఎంతో అసహ్యం కనకనే, యిలా తిరస్కరింపబడ్డాను!" దైన్యమైన శేఖరం మాటలు ఆమెకు బాధ కల్గించాయి.

"అవును. అసహ్యం... బాగా అసహ్యం నాకు మీరంటే!" నవ్వింది ఆమె. ఆమె నవ్వు శేఖరానికి వ్యంగ్యంగా కనిపించింది.

"అంత అసహ్యంగావుంటే—పిలవడమెందుకూ?"

"అందుకే వెళ్ళండి ... వచ్చిన పని అయిపోయిందిగా... ఫలహారం తిన్నారుగా!"

ఆమె కఠినమైన మాటలు శేఖరంలో ఉక్రోషం ప్రజ్వలించాయి. లేచి దురుసుగా గది గుమ్మం దాటబోయాడు.

"ఏమండీ అంత కోపమా! కాస్సేపు కూర్చోరూ" ఆమె నవ్వు. గులాబి పువ్వులా వచ్చిన ఆమె పెదాలు... కాంతివంతమైన ఆమె కొంటెచూపు, కుర్చీవైపు స్వాగతం చూపిస్తూ నృత్య భంగిమలో నుంచున్న ఆమె ఒయ్యారపు శరీరం—అతని దురుసు నడకతో మెత్తగా మీదనుంచి ప్రస

రించే ఆమె కొప్పులోని మల్లెల వాసనలు—శేఖరాన్ని ఉన్మత్తుణ్ణి చేశాయి— శేఖరం పశ్చాత్తాపపడ్డాడు — ఆమె మాటల వెనుకవున్న మనస్సు అర్థంచేసుకోవాలి కాని... ఆమె ప్రవర్తన ముఖ్యం కాదనుకున్నాడు.

ఆమెలో రెండు సంవత్సరాల్లో ఎంతో మార్పు—కొంచెం లావెక్కింది ..ఎదిగిన ఆమె పాప ఆడుతూ అల్లరి చేస్తోంది...డాక్టరు ప్రాక్టీసుకోసం వీధి వరండాలో తడికలతో ఒకచిన్న డిస్పెన్సరీ తయారయింది-గదిలో అలమారు అద్దాల తలుపులోంచి మందుల సీసాలు కనిపిస్తున్నాయి. టాయిలేట్ అద్దాల డ్రాయరు, క్రొత్త శోభ చేకూర్చే నిర్మల్ బొమ్మల ఫొటోలు టేబులమీద స్టెతోస్కోపు—చదువుకునే మందుల పుస్తకాలు...అదొక్క కొత్త వాతావరణం-- సంపాదనలోపడి-జీవితంలో అడుగుపెట్టి -- గృహిణిగామారి-పెద్దరికాన్ని ఒలకపోస్తూ - అధికారాన్ని చలాయిస్తూ-బాధ్యతలు స్వీకరిస్తూ క్రొత్త పంథాలో బ్రతుకు రుచులు చూస్తున్న ఆమెకు-పురాతన బాధలతో వ్యక్తిగత బ్రతుకులో మార్పులేక-బ్రితుకులో ఆవేదన మర్చిపోడానికి అనంతమైన కార్యక్రమాలలో సతమతమౌతూ, కీర్తి ప్రతిష్టల నీడల్లో భగ్నజీవిత దుఃఖాన్ని భరిస్తూ--ఆనందం రుచి లేకుండా- మోడుపడిన గొప్ప వృక్షంలావున్న తనకూ—ఎంతో వ్యత్యాసం గోచరించింది. ఆమె బ్రతుకు ఒకవిధంగా

పరిపూర్ణమౌతోంది. కాని తనది-వాన చినుకులకు ఆశించే ముత్యపు చిప్పలా — ఎండిపోతున్న ఈ ఆశల బ్రతుకులో ఎప్పుడు ప్రేమమాధుర్య కణాలు రాలుతాయా అని ఎదురు చూసే నిరంతర నిర్వీరాను జీవితం-

శేఖరం నిట్టూర్పు విడిచాడు.

లిల్లీ లోపలికి వచ్చింది.

"నేను బొంబాయి వెళ్ళినప్పుడు ఒక డాక్టరు స్నేహితుడు మావారికి ఈ కుక్కను బహుమతి యిచ్చారు... యిది నాకు చాలా ప్రియతమమైంది—అదికూడా నేనంటే ఒక్కక్షణం విడిచి ఉండలేదు — రాత్రిళ్ళువచ్చి పక్కలో పడుకుంటుంది-- కాలితో నిద్రలో తన్నితే మూల్గి మళ్ళీ దగ్గరికి వచ్చి ఒరుగుతుంది చంటిపిల్లలా -- ఎంత విశ్వాసమైన జంతువు?"

ఆమె శేఖరాన్ని చూసి నవ్వింది కొంటెగా.

"అయితే -- యిటువంటి విశ్వాసం -- మనుష్యుల్లో లేదు--" తల దించుకుంది ఆమె.

నోరు తెరుచుకుని ఆయాసంగా కూర్చున్న కుక్క నోట్లో చెయ్యి పెట్టింది ఆమె.

కుక్క కొద్దిగా కరిచింది.

"ఛీ! వెధవ: నెత్తిమీద కొట్టింది-కుక్కను కాలితో తన్నింది ఆమె--కుక్క మూల్గుతూ గది బయటికి నడిచింది.

కథా నిలయం
2057



"విశ్వాసమున్న జంతువులు కరుస్తాయా?" శేఖరం హేళన చేశాడు ఆమెను.

ఆమె గర్వం, హోదా-దెబ్బతిన్నట్లయింది, అతని మాటలలో, తన్నూ, తన కుక్కనూ చులకన చేసినట్లు భావించి బాధపడింది ఆమె.

చిన్న ఎలకపిల్లను తరుముకుంటూ బొంయ్ మంటూ మళ్ళి లోపలికె వచ్చిన కుక్క వీరావేశంతో టేబిలుమీదకు ఎగిరి అన్నీ చిందరవందరగా పారేసింది. ఆమెకు కోపం వచ్చింది.

"ఫో ఇడియట్!" రుసరుసలాడుతూ కుక్కను తన్ని క్రిందపడిన సామాన్లు సర్దుకుంది ఆమె.

"ఈ కుక్క మీ యింట్లో శత్రుజాలాన్ని హతమారుస్తోంది!" పక పక నవ్వాడు శేఖరం.

ఆమె ముఖం తుడుచుకుంది.

ఎదురుగా శేఖరం ముఖంమీంచి దోమలు ఎగిరాయి. చేతులతో చరిచి కొట్టి వాటిని చంపేశాడు.

"పాపం! మీరూ మా శత్రుజాలాన్ని చంపుతున్నారే!" ఆమె తన కసి శేఖరంమీద తీర్చుంది.

ఆమె మాటల్లోని వ్యంగ్యార్థం శేఖరానికి అర్థమయింది. తన్ను తన పెంపుడు కుక్కతోను, తనమాటల ఉపమానంతోనే ఆమెకూడా పోల్చింది.

"విశ్వాసమున్న ప్రతీ జంతువు. వ్యక్తికూడా ఆమాత్రం సాయం చేయకపోతే ఎలా?" ఆమె కలకల నవ్వింది.

ఆమె ప్రేమారాధనతో విశ్వాసమున్న జంతువులా ఆమె చుట్టూ అతను తిరగాలనే అకాంక్ష ఆమెకు అనంతమని తెలుసు. అప్పుడే ఫలహారం తిన్న తాను తను ఆమె ఉప్పు తిన్న మనిషిలా ఈదోమల తోలె వుపకారం అతను చేసినట్లు ఆమె భావించింది.

ఎంతోకాలం తర్వాత కలుసుకున్న తన్ను ఇంటికి రమ్మని పిల్చిన తన్ను, ప్రతి విషయంలో వ్యంగ్యంగా మాట్లాడి హృదయాన్ని ఖిన్నపరచడంలో ఆమె అంత రంగికంగా పొందే ఆనంద మేమిటో శేఖరానికి అర్థం కాలేదు. ఉప్పొంగే ప్రేమ హృదయాన్ని ఒకేసారి చూపించేస్తే, ఆ ఆనంద మైకంలో, సంతృప్తితో. వ్యక్తి అనందం యిచ్చిన వ్యక్తిని మరచిపోవచ్చనే భయం ఆమెలో వున్నట్లనిపించింది. శేఖరం తన్ను మర్చిపోయాడు—అందుకే ప్రతిక్షణం అతని హృదయాన్ని గాయ పరచాలి—తన్ను అతను నిత్యమూ జ్ఞప్తికి తెచ్చుకుని బాధపడాలి—అని ఆమె భావన కావచ్చు అనుకున్నాడు శేఖరం. విచిత్ర మనస్తత్వం. బాధపడ్డాడు శేఖరం. అయితే అతని ఊహలో తన బాహ్య ప్రజా జీవితం ఒకక్షణం తిరిగింది. సభలు, ఉపన్యాసాలు, పూలమాలలు గౌరవాలు, అనంతంగా వచ్చే అభినందన

పత్రికలు, స్నేహాన్ని ఆశించే లలనల లేఖలు, దూరప్రాంతా లకు రమ్మని పిలచే పెద్దల ఆహ్వానాలు, గుంపుల్లో నడుస్తూ వుంటే తన్నుగురించి వేలెత్తి చూపిస్తూ అభిమానంగా జనం ఆడే గుసగుసలు తన ప్రతిభ. వ్యక్తిత్వం, కీర్తి, హోదా, అన్నీ గుర్తుకు వచ్చాయి. అటువంటి శేఖరం ఒక స్త్రీ యింట్లో, గదిలో ఒక కుక్కతో పోల్చబడడం సహించ రాదని అనిపించింది శేఖరానికి.

"వెడతానండి"

"నిక్షేపంలా...ఫలహారం అయిపోయిందిగా యింక పనేముంది?"

"నేను తిండికోసం వచ్చేనా!"

"వచ్చినట్లు మీరు లేచిపోతూంటే..."ఆమె తీవ్ర వదనంలో ఏమిటో దొంగనవ్వు దాక్కుంది. ఆమె నవ్వు చూసి ఆగాడు శేఖరం" ఆమె కూర్చోమంటుంది అని ఆశిస్తూ.

"వెళ్ళండి—నిలబడ్డారే"

"వెడుతున్నా"

"మళ్ళీ రాకండి—యింక!"

ఆమె మాట శూలంగా గుచ్చుకొంది శేఖరానికి.

"ఊఁ—నడవండి !"

బలవంతంగా ముందుకు నడిచాడు శేఖరం.

బాధగాచూస్తూ కదలలేక కదల్తూ.

ఆమెను అసహ్యించు కోవా లనిపించింది.

ఆమెను జన్మలో చూడకూడ దనిపించింది.

ఆమె పిలచినా యింక పలకరా దనిపించింది.

ఆమె తన్ను ప్రేమించినట్లు బట్టబయలు చేసి బాధ పెట్టాలనిపించింది.

ఆమెను హత్యచేస్తే ... క్రూర జంతువును చుట్టివ కొండచిలవలా లోలోపల సుళ్ళు తిరిగిపోయాడు శేఖరం.

ప్రేమను అవమానించిన స్త్రీని హత్యచేయాలి !

శేఖరం రుద్రుడైపోయాడు.

కోపంగా విసురుగా నడిచాడు.

"“ఏమండీ!” ఆమె వెనకనుంచి అరచింది దీనంగా, స్నేహంగా.

“నమస్తే” దూరంగా ఆమెకంఠం ప్రేమతో కంపించింది.

శేఖం కోపంతగ్గినా, నడక వేగం తగ్గలేదు.

ఆమె దెబ్బతిన్న తాచుపాములా రోజింది.

ఆమె అహంకారం ఔన్నత్యం ఛిన్నాభిన్నమైంది.

శేఖరం బాధపడుతూ తన్ను ప్రేమించాలనుకున్న ఆమెకు నిరాశ కలిగింది.

గుండెల్లో కుంపటి రాజుకుంది. అసూయ, మాత్సర్యం నిస్పృహ, ఏమిటో విపరీతమైన అసంతృప్తి ఆమెలో.

శేఖరానికి తనమీద గౌరవం లేదా గొణుక్కుంది.

శేఖరాన్ని తిరస్కరించినా, అతను ఆమెమీద అభిమానం, ప్రేమ పోలకబోయాలని ఆమె బాధ, ఆవేదన, నిత్యం పేర్మిస్తున్నానని, ఆవేదనపొందే ఒక మగమనిషి ఆడదాని అహంభావానికి చక్కటి ఆహారం.

ఖిన్నవదనంతో తన గదిలోకి నడిచింది ఆమె.

లిల్లీ ఆమెవెంట లోపలికి వెళ్ళింది తోకాడిస్తూ.

కోపంగా ఆమె లిల్లీని పొట్టలో తన్నింది.

కుక్క కుయ్యో మొర్రోమంటూ అరుస్తూ బయటికి పోయింది.

గది బయటినుంచే, ఆమె తల్లి మందలింపు, కుక్కను తన్నినందుకు.

లైట్లు ఆర్పింది ఆమె.

గదిలో చీకటి.

కడుపులో ఆకలి.

మనస్సులో అసంతృప్తి.

మళ్ళీ శేఖరాన్ని పిలవాలి, అవమానించకూడదు.

ఆమె వేడి కన్నీరు ప్రవహించింది.

శేఖరం? వస్తాడా--పిలిస్తే?

తోకాడించుకుంటూ మళ్ళీ కుక్క వచ్చింది గదిలోకి-శేఖరం వస్తాడు. ఆమె ఆశించింది !

లిల్లీ!--అంటూ ఆమె దానిమీద చేయివేసింది.

లిల్లీ గెంతి ఆమె ప్రక్కలోకి చేరింది.

"శేఖరం!" ఆమె నిట్టూర్పు విడిచింది.

తన పెంపుడు కూతురు భోజనం చేయలేదని ఆమెతల్లి వాత్సల్యంతో లోనికివచ్చి ఆమెను పలకరించే ధైర్యంలేక, కదిలి బయటికి వెళ్ళిపోయింది.

చీకటి మసకల్లో ఆమె కళ్ళముందు శేఖరం.

అతను బాధగాఏడ్చే కన్నీటి దృశ్యం! కదిలాయి.

ఎంత విశ్వాసం! ఎంత స్నేహం!!

ఆమె నిట్టూర్పు విడిచింది.

ప్రక్కలో ఉన్న లిల్లీ అవునన్నట్లు సన్నగా మూల్గింది.